క్లుప్తంగా

ఇంటర్‌లో అదనపు తరగతులు

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు, విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించేందుకు రెండు పూటలా అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.దాలినాయుడు తెలిపారు. కళాశాలలో అదనపు తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కళాశాలలో 256 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్టు, 19 మంది అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సెలవు రోజుల్లో తప్ప మిగతా రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి 9.30 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు సబ్జెక్టుల వారీగా అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



బొత్స కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బొత్స కృష్ణ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శనివారం పరామర్శించారు. మండలంలోని బోగవలసకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స కృష్ణ తల్లి ఆదమ్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజన్నదొర శనివారం కృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. తన సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు.

మార్చిలోగా ఇళ్లు పూర్తి చేయాలి : డీఆర్‌ఓ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కేశవనాయుడు

సాలూరు రూరల్: గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లు వచ్చే ఏడాది మార్చి 25లోగా పూర్తి చేయాలని డీఆర్‌ఓ జి.కేశవనాయుడు అన్నారు. మండలంలోని మామిడి గ్రామంలో గృహ నిర్మాణ లబ్ధిదారుల అవగాహన సదస్సులో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులు ఇంత వరకు చేపట్టిన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఎస్‌హెచ్‌జీల ద్వారా రూ.35వేలు మంజూరు చేయిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

సాలూరు: మున్సిపాలిటీలో పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన తన కార్యాలయంలో మున్సిపాలిటీలోని వివిధ విభాగాల అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల తదితర పన్నులపై ఆరా తీశారు. శాఖల వారీగా వివిధ అంశాలపై చర్చించారు. ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని కోరారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు



సమావేశంలో మాట్లాడుతున్న ఇందిర

బలిజిపేట: సీపీఎం నేత సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.ఇందిర అన్నారు. సీఐటీయూ స్థానిక కార్యాలయంలో ఏచూరి సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1992 నుంచి ఆయన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఉన్నారన్నారు. ప్రజలు, కార్మికుల కష్టాల విముక్తికి రాజకీయాల్లో అవిశ్రాంత పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మన్మధరావు, జి.సత్యనారాయణ, బి.భానుమూర్తి పాల్గొన్నారు.

జీఓ నంబరు 3ని పునరుద్ధరించాలి

సాలూరు రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జీఓ నంబరు 3ని పునరుద్ధరించాలని జగ్గుదొరవలస గిరిజనులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్గుదొరవలసలో గిరిజనులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా గిరిజనుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఐటీడీఏ పార్వతీపురం పరిధిలో ఉన్న 2016గిరిజన గ్రామ పంచాయతీల్లో కేవలం 77 గిరిజన గ్రామ పంచాయతీల్లో మాత్రమే పీసా ఎన్నికలు నిర్వహించడం దీనికి నిదర్శనమన్నారు. నిమ్మక అన్నారావు, సీతరపుచిన్నప్ప, బాడంగి బాబయ్య పాల్గొన్నారు.

కూటమి నేతలకు.. బుద్ధి ప్రసాదించాలని పూజలు



పార్వతీపురం/పార్వతీపురం టౌన్: కోవెలవీధిలో స్వామి పూజల్లో పాల్గొన్న మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తదితరులు

కలియుగ వేంకటేశ్వరస్వామి తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందంటూ కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారంపై నిజాలు వెలికితీసి తప్పు చేసిన వారిని శిక్షించేలా చూడు స్వామి అంటూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లోని పలు దేవాలయాల్లో శనివారం పూజలు నిర్వహించారు. పాప ప్రక్షాళన జరగాలని, తప్పు చేసిన వారిని శిక్షించాలని, కూటమి నేతలకు బుద్ధి ప్రసాదించాలని పెద్ద ఎత్తున పూజలు చేశారు. పూజల్లో పార్టీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. వీరికి మద్దతుగా ప్రజలు కూడా స్వచ్ఛందంగా పూజల్లో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో అనవసరమైన రాద్ధాంతం చేస్తూ అపవిత్రం చేయడం ఎంతమాత్రం తగదని పలువురు పేర్కొన్నారు. స్వామే దోషులను శిక్షిస్తాడని, ధర్మాన్ని రక్షిస్తాడని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బలిజిపేట: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



మక్కువ: ఎస్.పెద్దవలసలో జగన్నాథ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పాచిపెంట: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సాలూరు రూరల్: మామిడిపల్లి గ్రామంలో గిరిజన రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గర్భిణులకు సీమంతం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మక్కువ: మండలంలోని మరిపివలస అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవాలు కార్యక్రమం సర్పంచ్ బెల్లాన కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ అనంతలక్ష్మి పౌష్టికాహారం ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం పోలినాయుడు, సూపర్ వైజర్లు ఎస్.లీలావతి, పి.రాజశ్రీ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నవతరానికి స్ఫూర్తి భగత్‌సింగ్

బలిజిపేట: నేటి నవతరానికి భగత్‌సింగ్ స్ఫూర్తి అని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు అన్నారు. పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాల వయసులో బ్రిటీష్ పాలకులపై కసితో పోరాడిన పోరాట యోధుడు భగత్‌సింగ్ అన్నారు మహాత్ముని పిలుపుతో 14 సంవత్సరాలకే సహాయ నిరాకరణ ఉద్యమంలో అడుగు పెట్టారన్నారు. ఆయన దేశం కోసం చేసిన త్యాగాలను మరువలేమన్నారు. కార్యక్రమంలో జి.శ్రావణ్‌కుమార్, బి.మహేష్, బి.జగదీపుట్టా తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో..



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పార్వతీపురం/టౌన్: స్వాతంత్ర్య పోరాటంలో అగ్నిబావుటాలను బ్రిటీష్ సైన్యంపై వేసి ఎదురొడ్డిన ధీశాలి భగత్‌సింగ్ అని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బోను రవికుమార్ అన్నారు. శనివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్ పాత్ర స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో కీలకమన్నారు. స్వాతంత్ర్య కాంక్షను ప్రజల్లో రగల్చి చిన్న వయస్సులోనే ఉరికంబాన్ని ముద్దాడిన భరతమాత ముద్దుబిడ్డగా వర్ణించారు. విద్యార్థులు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలన



పది విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: పదవ తరగతి విద్యార్థులను ప్రగతి పథంలో నడిపించాలని ఎంఈఓ–1 సామల సింహాచలం అన్నారు. బలిజిపేట ఉన్నత పాఠశాలను ప్రత్యేకాధికారి హోదాలో పర్యవేక్షించి పదవ తరగతి విద్యార్థులకు సూచనలు అందించారు. పదవ తరగతి పరీక్షలు, సిలబస్, చదువుపై ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. పదవ తరగతి నుండి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నందున వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలో తెలుసుకోవాలని సూచించారు. అందుకు ఉపాధ్యాయులు ఇచ్చే తర్ఫీదు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వెనుకబడి ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని ముందుకు తీసుకురావాలని సూచించారు.
పదవ తరగతిలో పాసైన విద్యార్థులకు భవిష్యత్‌లో ఉన్నతమైన చదువులు చదివేందుకు అవకాశాలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన



మిర్తివలసలో జిల్లేడు ద్రావణం తయారు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మిర్తివలసలో ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు ఆధ్వర్యంలో వరిలో పొటాష్, బోరాన్ కోసం 400 లీటర్ల జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒక డ్రమ్ము నీటిలో 20 కిలోలు తగ్గకుండా జిల్లేడు ఆకులు, 10 నుంచి 20 లీటర్ల దేశి ఆవు మూత్రాన్ని నాలుగు రోజులు మరగ పెట్టాలన్నారు. ఆ తరువాత తయారైన ద్రావణాన్ని పది లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండు లీటర్ల ద్రావణం కలిపి స్ప్రేచేస్తే పైరుకు కావాల్సిన పొటాష్, బోరాన్ కూడా లభిస్తుందన్నారు. ఒక డ్రమ్ము ద్రావణం ఎనిమిది ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

బడిదేవరకొండ అనుమతులు రద్దు చేయాలి



బడిదేవరకొండను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పార్వతీపురం/టౌన్: పార్వతీపురం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బడిదేవరకొండలో ఉన్న విలువైన గ్రానైట్ లీజులను తక్షణమే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గిరిజనులతో కలిసి బడిదేవర కొండను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కొండ సెంటిమెంట్‌గా 20 గ్రామాల రైతులు వర్షాల కోసం, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా ఉండాలని ప్రతీ ఏడాది అమ్మవారిని వేడుకుంటారన్నారు. ఈ బడిదేవరకొండవల్ల 20గ్రామాలకు చెందిన వ్యవసాయ భూములకు సాగునీరుతో పాటు 12 గ్రామాల గిరిజనులకు పోడు పంటలు సాగు చేసి జీవనోపాధి లభిస్తుందన్నారు. గ్రానైట్ లీజు రద్దు చేయకపోతే అఖిల పక్షాలతో కలసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు వెలమల సత్యనారాయణ, గరుగుబిల్లి సూరయ్య, తాడంగి పోలయ్య, చిన్నప్ప, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో కాలువ నిర్మించాలి



గడసింగుపురంలో మురుగు కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస: మండలంలోని గడసింగుపురం ఎస్టీ కాలనీలో మురుగు కాలువ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి గంగునాయుడు కోరారు. కాలనీలో మురుగు కాలువ వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఆయన క్షేత్ర స్థాయిలో శనివారం పర్యటించి పరిశీలించారు. కాలువ లేకపోవడంతో మురుగు ఇళ్లల్లోకి చొచ్చుకు వస్తుందని, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కాలనీ వాసులు అనేక సార్లు కాలువ నిర్మాణానికి విన్నవించినా అధికారులు స్పందించలేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన బాట పడతామని తెలిపారు.

నిజాలు నిగ్గు తేల్చాలి

- తిరుపతి లడ్డూ విషయంలో సీబీఐ విచారణకు ఆదేశించాలి
- కూటమి నేతలు విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర
- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా కలియుగ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం విషయంలో అనవసరమైన రాద్ధాంతంపై సీబీఐ విచారణకు ఆదేశించి నిజాలు నిగ్గు తేల్చాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూ ప్రసాదం గొప్పతనం దెబ్బతినేలా మాట్లాడుతున్న వారిని శిక్షించేలా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఆలయంలో పూజలు చేసిన అనంతరం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లడ్డూ విషయంలో కూటమి ప్రభుత్వ ఆరోపణలు, అసత్య ప్రచారంపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు బాధ్యతారహితంగా ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు చేసిన పాపాల పరిహారం కోసం తమ పార్టీ అధినేత ఇచ్చిన పిలుపు మేరకు కూటమి నేతలకు బుద్ధి ప్రసాదించాలని ఆలయాల్లో పూజలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. లడ్డూ కోసం సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందో.. లేదో.. ఆ నెయ్యి వినియోగించారో.. లేదో.. స్పష్టత లేకుండా.. తగు విచారణ జరపకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పొంతన లేని ఆరోపణలు చేస్తూ తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. తమ ఆరోపణలు నిజమని తేల్చేలా తన పరిధిలో ఉండే సిట్‌తో దర్యాప్తు చేయిస్తున్నారని, దీని వల్ల నిజాలు బయటకు రావన్నారు. ఈ అంశంలో ప్రజలకు వాస్తవాలు తెలిసేందుకు సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తుల పర్యవేక్షణలో సీబీఐతో విచారణ చేయించి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

డిక్లరేషన్ నాటకం

తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు అండ్ కో చేసిన ఆరోపణల వెనుక విద్వేషాలను రెచ్చగొట్టే భారీ కుట్ర ఉన్నట్టుందని రాజన్నదొర అభిప్రాయపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి గతంలో పలుసార్లు తిరుపతి దేవస్థానానికి వెళ్లారని ఇప్పుడు మళ్లీ డిక్లరేషన్ నాటకం చంద్రబాబు ఆడడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అప్పుడు లేని అభ్యంతరం, డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకు అవసరమైందని నిలదీశారు. ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించేందుకే టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామీ.. పాప ప్రక్షాళన చేయు...

అంతకు ముందు పట్టణ ముఖద్వారంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రాజన్నదొర పార్టీ శ్రేణులతో కలిసి పూజలు చేశారు. తిరుపతి లడ్డూ విషయంలో అసత్యాలతో కూటమి నేతలు పాపం చేశారని, వారు చేసిన ఈ పాపాల ప్రభావం రాష్ట్రంలో ప్రజలపై పడకుండా చూడాలని పూజలు చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీప పాచిపెంట మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు గిరి రఘు, దండి శ్రీనివాసరావు, భరత్ శ్రీనివాసరావు, మువ్వల ఆదయ్య, వెంకటరమణ, శ్రీనివాసరావు, మద్దిల గోవింద, నాగ, బీసు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కరుణాకర్

సీతానగరం: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎంపీ కరుణాకర్ అన్నారు. ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో కమలాతోట కాలనీలో శనివారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్లన్నీ పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారుల బిల్లుల చెల్లింపునకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మార్చి 31లోగా ఇళ్లను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ ఏఈ జానకీరాం, వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు, సర్పంచ్ తేరేజమ్మ, ఉప సర్పంచ్ కె.అరవింద్‌కుమార్, శ్రీరామా సుగర్ కేన్ సొసైటీ చైర్మన్ సబ్బాన ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలవ్వండి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: రక్తదానం చేయడం వలన ప్రాణదాతలు అవుతారని పట్టణ సీఐ అప్పలనాయుడు అన్నారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రక్తదానం ఆవశ్యకతపై యువతకు అవగాహన పెంపొందించి మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించి తద్వారా ఎందరో ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.